క్లుప్తంగా

నేలకొరిగిన భారీ వృక్షం



మాచవరంలో నేలకొరిగిన భారీ వృక్షం

అంబాజీపేట: మండలంలో శనివారం తెల్లవారుజామున భయంకర ఉరుములు, ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు మాచవరం పంచాయతీ పక్క వీధిలో ఉన్న భారీ వృక్షం నేలకొరిగి ఓ ఇంటిపై పడటంతో స్వల్పంగా ధ్వంసమైంది. అలాగే మూడు విద్యుత్ స్తంభాలు, వైర్లు విరిగి పడిపోయాయి. అలాగే పసుపల్లి, వాకలగరువు, నందంపూడి, మాచవరం, పోతాయిలంక గ్రామాల్లో విద్యుత్ వైర్లపై కొబ్బరి చెట్లు, భారీ వృక్షాల కొమ్మలు పడి విద్యుత్ వైర్లు, కండెన్సర్‌లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. పలుచోట్ల అరటిచెట్లు విరిగి నేలమట్టమయ్యాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో విద్యుత్ శాఖ అధికారులు స్పందించి సరఫరాను పునరుద్ధరించారు. వేకువజామున ఉరుములు, భయంకర శబ్దాలు చేయడంతో వృద్ధులు, చిన్నారులు, వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. ఆకస్మికంగా కురిసిన వర్షానికి చిరు వ్యాపారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

అంకితభావంతో పని చేసిన వారికి గుర్తింపు



సాయిబాబును సన్మానిస్తున్న ఎండోమెంట్స్ ఉప కమిషనర్ విజయరాజు

మామిడికుదురు: విధి నిర్వాహణలో అంకితభావంతో పని చేసిన ఉద్యోగులకు ప్రజల్లో తగిన గుర్తింపు, గౌరవం లభిస్తాయని దేవదాయ శాఖ ఉప కమిషనర్ ఎం.విజయరాజు, అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం ఈఓ గ్రంధి మాధవి పేర్కొన్నారు. గతంలో అప్పనపల్లి దేవస్థానం ఈఓగా పని చేసి శుక్రవారం ఉద్యోగ విరమణ పొందిన డి.సాయిబాబు సన్మాన సభ శుక్రవారం రాత్రి అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయ ప్రాంగణంలో జరిగింది. సాయిబాబు దంపతులకు శాలువాలు వేసి జ్ఞాపికలు అందించి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. సాయిబాబు తన హయాంలో అందించిన సేవలను మననం చేసుకున్నారు. ఉద్యోగులపై, విధులపై సాయిబాబు ఎంతో నిబద్ధతతో పని చేశారన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



అంబాజీపేటలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అంబాజీపేట: వంట గ్యాస్ లీకై ప్రమాదం జరిగినప్పుడు అప్రమత్తంగా ఉండాలని అమలాపురం ఫైర్ ఆఫీసర్లు జి.శ్రీనివాస్, ఎం.బాలరవి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో ఫైర్ అగ్నిమాపక అధికారులు, సిబ్బంది మాక్ డ్రిల్‌ను శనివారం నిర్వహించి అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. వంట గ్యాస్ సిలిండర్ల వాడకం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను మహిళలకు వివరించారు. వంట గ్యాస్ సిలిండర్లు ద్వారా గ్యాస్ లీకై అగ్నిప్రమాదం సంభవిస్తే తీసుకోవాల్సిన చర్యలపై డెమో నిర్వహించారు. గ్యాస్ స్టౌపై వంటకాలు చేసే సమయంలో అతి జాగ్రత్తగా ఉండాలన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించినా లేదా ఎల్పీజీ వంట గ్యాస్ వాడుతున్నప్పుడు ఏదైనా ప్రమాదం జరిగితే ఏ విధంగా నిర్మూలించాలో వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం



అంతర్వేది దేవస్థానంలో విజయ శేఖర్‌కు సాయం చేస్తున్న సొసైటీ సభ్యులు

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానంలో అనారోగ్యంతో బాధపడుతున్న తాడి విజయ శేఖర్‌కు రూ.15 వేలను తాడి వారి ఇంటి పేరుతో సేవలందిస్తున్న సంస్థ తాడి వెల్ఫేర్ సొసైటీ శనివారం సాయం చేసింది. ఈ మేరకు విజయ శేఖర్‌కు ఇంటికి సొసైటీ సభ్యులు వెళ్లి, పై సాయం అందజేశారు. తాడి మోహన్, తాడి సహదేవ్, తాడి మోహన్‌బాబు, తాడి రాజేష్, తాడి రవీంద్ర, తాడి మన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



పి.గన్నవరంలో పంచముఖ ఆంజనేయ స్వామి



ప్రత్యేక అలంకరణలో కట్టుంగ ఆంజనేయస్వామి



అంబాజీపేటలో భక్తాంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



మోరి ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు దుర్గానగేష్



కొత్తూరులో ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధన

వైభవంగా హనుమజ్జయంతి

- ఆంజనేయునికి ప్రత్యేక పూజలు
- ఆలయాల వద్ద భారీ అన్నసమారాధనలు
- పలివెలలో పేదలకు దుప్పట్ల పంపిణీ

కొత్తపేట: హనుమజ్జయంతి పురస్కరించుకుని గ్రామగ్రామానా ఆంజనేయస్వామి ఆలయాలు, రామాలయాల్లో శనివారం వైభవంగా విశేష పూజలు నిర్వహించారు. పలివెల ప్రధాన వీధిలో అభయాంజనేయస్వామికి ఆలయ ఫౌండర్ వీవీఎస్ఎస్ మారుతిబంగారం–సుబ్బలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, తమలపాకుల పూజ తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ మార్గన గంగాధరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ ఎత్తున అన్నసమారాధన చేశారు. అనంతరం మారుతీబంగారం సుమారు 100 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. స్థానిక కోదండరామస్వామివారి ఆలయం (కొత్తరామాలయం) వద్ద బృహన్మూర్తి భక్తాంజనేయస్వామివారికి ఉత్సవ కమిటీ కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకుల పర్యవేక్షణలో వేదపండితులు జలాభిషేకం, పంచామృతాభిషేకం, పుష్పాభిషేకం, తమలపాకుల అర్చన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు వివిధ రకాల ప్రసాదాలు పంపిణీ చేశారు. బోడిపాలెం వంతెన వద్ద భక్తాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గ్రామ శివారు శీలంవారిపాలెం అభయాంజనేయస్వామి ఆలయంలో అలయ కమిటీ గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో హనుమజ్జయంతిని వైభవంగా నిర్వహించారు. పలు ఆలయాల వద్ద అన్నసమారాధన జరిపారు. అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



అప్పనపల్లిలో ఆంజనేయస్వామికి చేస్తున్న అభిషేకాలు

అంబాజీపేటలో..

అంబాజీపేట: స్థానిక పశువుల మార్కెట్‌లో అభయాంజనేయస్వామి, పెద్దవీధిలోని నాగమల్లె చెట్టు వద్ద ఉన్న దాసాంజనేయ స్వామి, గంగలకుర్రు అగ్రహారం ముషిణివారిపాలెం హనుమాన్ సెంటర్‌లోను, ఇరుసుమండలోని భక్తాంజనేయ స్వామి, వ్యాఘ్రేశ్వరం, మాచవరం, గంగలకుర్రు, వక్కలంక, ముక్కామలలో ఆంజనేయ స్వామికి లక్ష తులసి, తమలపాకుల పూజ, సింధూర పూజలు నిర్వహించారు. పోతాయిలంకలో భక్తాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయ ప్రాంగణాల వద్ద భారీ అన్నసమారాధన జరిపారు. పసుపల్లిలో సీతారామ పట్టాభిషేకం ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం హనుమజ్జయంతి వేడుకలను వైభవంగా జరిపించారు. దీనిలో భాగంగా ఆంజనేయస్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అత్యంత ప్రీతికరమైన నేతి గారెలను స్వామికి సమర్పించారు. మామిడికుదురు, నగరం, అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పాశర్లపూడి, పాశర్లపూడిలంక, పెదపట్నం, మొగలికుదురు, గెద్దాడ, లూటుకుర్రు, మగటపల్లి తదితర గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు జరిగాయి. ఆధ్యాత్మిక గీతాలతో ఏకాహం జరిపించారు. పలు ఆలయాల వద్ద అన్న సమారాధనలు ఏర్పాటు చేశారు.



పలివెల గ్రామంలో హనుమజ్జయంతిలో ఎంపీపీ గంగాధరరావు, మారుతీబంగారం తదితరులు

అయినవిల్లిలో..

అయినవిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో హనుమజ్జయంతిని శనివారం ఘనంగా జరిపారు. సిరిపల్లిలో పంచముఖ ఆంజనేయస్వామి వారికి, అయినవిల్లిలో భక్తాంజనేయ స్వామికి, వీరవల్లిపాలెంలో హనుమంతునికి అలాగే వివిధ గ్రామాల్లో కొలువైన స్వామివార్లకు విశేష పూజలు జరిపారు. భక్తులు స్వామిని అధిక సంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. కానుకలు మొక్కులు చెల్లించారు. భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పలు గ్రామాల్లో భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఆత్రేయపురంలో..

ఆత్రేయపురం: మండలంలోని గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఆత్రేయపురం, బొబ్బర్లంక, మెర్లపాలెం, లొల్ల, ర్యాలి, నార్కెడ్‌మిల్లి, అంకంపాలెం తదితర గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. హనుమంతుడికి ప్రీతిపాత్రమైన తమలపాకులు, గంధసిందూరం, అప్పాలతో భక్తులు స్వామికి నైవేద్యాలు సమర్పించారు. పలు ఆలయాల్లో అర్చకులు ఆఖండ దీపారాధన, తదితర కార్యక్రమలు ఘనంగా నిర్వహించారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: మండలంలోని శ్రీరాముని ఆలయాల్లో, ఆంజనేయస్వామివారి ఆలయాల్లోను శనివారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులు ఆలయాలకు తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. మోరి ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఆలయ అర్చకుడు ఎస్‌బీవీఎస్ఎస్ దుర్గానగేష్ ఆధ్వర్యంలో భక్తులు సింధూర పూజలు, సహస్ర నామాలతో తమలపాకు పత్రాలతో స్వామికి పూజలు చేశారు. అలాగే పలు గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆలమూరులో..

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో హనుమజ్జయంతి ఉత్సవాలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. వేకువజాము నుంచే భక్తులు పుణ్యస్నానమాచరించి ఆయా గ్రామాల్లోని ఆంజనేయ స్వామి ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలమూరు శివారు కొత్తూరు సెంటర్‌లో వేంచేసిన ఆంజనేయస్వామి ఆలయంలో స్వామి వారికి వివిధ రకాల పిండివంటలను నైవేద్యంగా సమర్పించారు. అలాగే మండలంలోని పినపళ్ల, కొత్తూరు సెంటర్‌లో వేంచేసిన అభయ ఆంజనేయస్వామి ఆలయాల్లో భారీ అన్నసమారాధనలు జరిగాయి. భక్తుల సహకారంతో ఆయా ఆలయాల పరిధిలో సుమారు పది వేల మందికి ఈ అన్నసమారాధనలు నిర్వహించారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: హనుమజ్జయంతి సందర్భంగా మండలంలోని ఆంజనేయ స్వామి వారి ఆలయాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి. ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. పి.గన్నవరం అక్విడెక్టు వద్ద వేంచేసిన పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతిని ఆలయ కమిటీ చైర్మన్ పడాల సూపర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

అర్చకస్వామి సాయికృష్ణ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. వందలాది మంది భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. అలాగే ఎల్.గన్నవరంలో వేంచేసిన దాసాంజనేయ స్వామి ఆలయంలో ఖండవిల్లి నారాయణాచార్యుల ఆధ్వర్యంలో స్వామికి పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

ప్రశాంత వాతావరణానికి సహకరించాలి

అంబాజీపేట: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ పూర్తి సహకారం అందించాలని ఎస్సై కె.చిరంజీవి అన్నారు. గంగలకుర్రు అగ్రహారం పంచాయతీ కార్యాలయం వద్ద వివిధ పార్టీల నాయకులు, స్థానికులతో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై చిరంజీవి మాట్లాడుతూ ఈ నెల 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో ఎటువంటి ర్యాలీలు, బాణసంచా కాల్పులు లేవని వాటిని నిషేధించారన్నారు. ఎవరైనా సైలెన్సర్‌లు తీసి బైక్ నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే కవ్వింపు చర్యలకు పాల్పడిన, వాట్సాప్ గ్రూప్‌లో రెచ్చగొట్టేలా పోస్టింగ్‌లు పెట్టినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లా అంతటా 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఎన్నికల ఓట్ల లెక్కింపు ముగిసే వరకు గుంపులుగా ఉండటం గాని, ర్యాలీలు, సభలు పెట్టడం చేయకూడదన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. సమావేశంలో సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, ఎంఎం శెట్టి, రాయుడు షణ్ముఖ్, బందన రాంబాబు, పులిదిండి ఏడుకొండలు, మట్టపర్తి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీదే మళ్లీ అధికారం



తేతల మోహన్‌రెడ్డి

మామిడికుదురు: వైఎస్సార్ సీపీ రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి రాబోతుందని, సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించనున్నారని ఆ పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి తేతల మోహన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సంక్షేమ పాలనకు ప్రజలకు అండగా నిలిచారన్నారు. ఎన్నికలు జరిగిన తీరును పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుందన్నారు. వైఎస్సార్ సీపీకి ఎదురు లేదని, ఎన్ని పార్టీలు కలిసి పోటీ చేసినా వైఎస్సార్ సీపీ విజయాన్ని అడ్డుకోలేవన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ ఫలాలు పార్టీకి ఎన్నికల్లో ఎంతో అండగా నిలిచాయన్నారు. తొమ్మిదో తేదీన విశాఖపట్నంలో జగన్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమన్నారు.

కనకమహాలక్ష్మి జాతరకు ఏర్పాట్లు పూర్తి



కనకమహాలక్ష్మి అమ్మవారు

ఆత్రేయపురం: గ్రామదేవత కనక మహాలక్ష్మి అమ్మవారి జాతరను, బళ్లసేవ పేరుతో ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం అమ్మవారి జాతర నిర్వహించడానికి అమ్మవార్ని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఇక్కడ శతాబ్దాలుగా గ్రామం ఏర్పడినప్పటి నుంచి బళ్లసేవ పేరుతో జాతర ఘనంగా నిర్వహించేవారు. పూర్వం నెల రోజుల పాటు ఈ జాతర నిర్వహించేవారని పెద్దలు చెబుతారు. నాడు వాహనాలు లేని కాలంలో ఎడ్ల బళ్ల యజమానులు అమ్మవారి జాతరను సొంత ఖర్చులతో గ్రామప్రజల సహకారంతో నిర్వహించేవారు. ప్రస్తుతం అమ్మవారి ఆలయాన్ని దాతల సాయంతో అత్యంత సుందరంగా నిర్మించారు. అమ్మవారికి ఆదాయానికి ఏ విధమైన లోటు పాట్లు లేనప్పటికీ నిర్వహణ సక్రమంగా లేక ఆదాయం సమకూరడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈ జాతరను మే నెలలో నిర్వహించడం ఆనవాయితీ. అమ్మవారికి ఆలయ నిర్మాణం సమయంలో కొందరు దాతలు భారీ విరాళాలు అందించారు. జాతర మహోత్సవ కార్యక్రమాలకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ దేవతగా ప్రసిద్ధి చెందిన మహాలక్ష్మి అమ్మవారిని భక్తి శ్రద్ధలతో కొలిస్తే కోరిన కోర్కెలు నెరవేరతాయని భక్తుల విశ్వాసం. అందుకు అనుగుణంగా వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

వేంకటేశ్వరుని ఆలయాలకు భక్తుల తాకిడి

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్శిపూడి, జొన్నాడ గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణ చేశారు. ఆయా ఆలయాల్లో దేవతామూర్తుల విగ్రహాలను పూల, తులసి మాలలతో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చింతలూరులోని గోశాలను దర్శించుకున్న భక్తులు గోమాతలకు పూజలను నిర్వహించారు. స్థానిక ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

నల్లచెరువులో..

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేద పండితులు ఆధ్వర్యంలో తెల్లవారు జామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితుల స్వామికి తులసి పూజలు చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు

కొత్తపేట: మండలంలోని మందపల్లిలో శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు నిర్వహించారు. స్వామివారి ప్రాతఃకాల అర్చన అనంతరం భక్తులు తైలాభిషేకాలు, సర్వదర్శనాలు చేసుకున్నారు. దేవస్థానం ఏసీ అండ్ ఈఓ కె.విజయలక్ష్మి భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు. టిక్కెట్లు, వివిధ సేవల ద్వారా రూ.1,64,345 ఆదాయం వచ్చినట్లు ఈఓ మూర్తి తెలిపారు. అలాగే అన్నప్రసాద పథకానికి పలువురు భక్తుల ద్వారా విరాళాల రూపంలో మరో రూ.37,598తో మొత్తం రూ.2,01,943 ఆదాయం వచ్చినట్టు దేవస్థానం ఈఓ విజయలక్ష్మి తెలిపారు. సిబ్బంది, పలువురు గ్రామస్తులు అన్నప్రసాద సేవలో పాల్గొన్నారు.

విద్యార్థులకు శుభ్రమైన భోజనం అందించాలి



అంబాజీపేటలో వంటకాలను రుచి చూస్తున్న ఏడీ సురేష్, అధికారులు



చెముడులంకలో ప్రసంగిస్తున్న మధ్యాహ్న భోజన పథకం జిల్లా డైరెక్టర్ సురేష్


అంబాజీపేట: మధ్యాహ్న భోజన పథక కార్మికులంతా విద్యార్థులకు అందించే భోజనాన్ని శుచి, శుభ్రతతో అందించాలని కోనసీమ జిల్లా మిడ్ డే మీల్స్ ఏడీ ఎస్.సురేష్ పేర్కొన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో ఎంఈఓ-1 కె.వెంకటేశ్వరరావు, ఎంఈఓ-2 మోకా ప్రకాష్‌ల ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథక కార్మికులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. సురేష్ మాట్లాడుతూ విద్యార్థులందరికీ పోషకాహారాన్ని అందించాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. శుచిగా, రుచికరంగా వండడంలో ఏజెన్సీల నిర్వాహకులు నైపుణ్యం చూపాలన్నారు. ముందుగా విద్యాశాఖాధికారులు సూచించిన ప్రకారం మధ్యాహ్న భోజన పథక వీడియోలు చూపించి ప్రతి వంటకం ఎలా చేయాలో వివరిస్తూ పీపీటీలను స్టార్ టీవీల ద్వారా ప్రయోగాత్మకంగా చూపించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు తయారు చేసిన వంటకాలను అధికారులు రుచి చూశారు. కార్యక్రమంలో హెచ్ఎం కడలి సాయిరామ్, పీహెచ్‌సీ వైద్యాధికారి కె.నాగ శ్రీనివాస్, సీహెచ్ఓ బి.అప్పారావు, డీఈఓ కార్యాలయ సిబ్బంది మౌనిక, సౌజన్య, సీఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

చెముడులంకలో..

ఆలమూరు: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆ శాఖ జిల్లా డైరెక్టర్ ఎస్.సురేష్ అన్నారు. మండలంలోని చెముడులంక జెడ్పీ హైస్కూల్‌లో ఎంఈవో పీవీ సుబ్బరాజు అధ్యక్షతన శనివారం మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డైరెక్టర్ సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యతతో కూడిన పరిశుభ్రమైన భోజనం తయారు చేసే వడ్డించాలన్నారు. విద్యార్థులందరూ పూర్తి స్థాయిలో భోజనాన్ని సద్వినియోగం చేసుకునేలా ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలన్నారు. గ్యాస్ వాడకంలో ప్రమాదాలు జరగకుండా ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై మండపేటకు చెందిన అగ్నిమాపకదళ ప్రత్యేక అధికారి బి.సుబ్రహ్మణ్యం వివరించారు. విద్యాశాఖ ప్రతినిధులు మౌనిక, సౌజన్య, నాగేశ్వరి, శివరంజని తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ఆరోగ్యకరంగా వండి అందించాలని మిడ్ డే మిల్స్ సిబ్బందికి అధికారులు సూచించారు. శనివారం స్థానిక డాన్ బాస్కో ప్రైవేట్ స్కూల్ రావులపాలెం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలోని ఎండీఎం సిబ్బందికి ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు పాఠశాలల్లో ఎండీఎం కోసం వండాల్సిన వీడియోలు ప్రొజెక్టర్ ద్వారా వేసి పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో చూపించారు. ఈ వీడియోలను తిరుపతిలోని తాజ్ హోటల్ సంస్థ రూపొందించినట్టు వివరించారు. అనంతరం రోజువారీ వంటల పోటీలు నిర్వహించగా ప్రథమ స్థానం జెడ్పీ ఉన్నత పాఠశాల ఊబలంక, రెండవ స్థానం జిల్లా పరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాల పొడగట్లపల్లి, తృతీయ స్థానం జెడ్పీ ఉన్నత పాఠశాల వెదిరేశ్వరం సిబ్బంది సాధించారు. అలాగే ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదాలు సంభవించిన నివారించడానికి తీసుకోవలసిన జాగ్రత్తలపై కొత్తపేట ఫైర్ మాన్ డి.విజయ్, సహచరుడు ప్రసాద్ అవగాహన కల్పించారు. జిల్లా విద్యాశాఖ ఎండీఎం అధికారి సురేష్ ఈ శిక్షణా కార్యక్రమాన్ని సందర్శించి పలు అంశాలపై అవగాహన కల్పించారు.

ముక్తేశ్వరంలో వాహనాల తనిఖీ



ముక్తేశ్వరం సెంటర్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై రాజేష్‌కుమార్

అయినవిల్లి: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎక్కడ అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు స్థానిక ఎస్సై వి.రాజేష్‌కుమార్ తెలిపారు. ముక్తేశ్వరం సెంటర్‌లో శనివారం అనుమానాస్పదంగా తిరుగుతున్న పలువురు యువకుల వాహనాల రికార్డులను తనిఖీ చేశారు. వారు ఎక్కడ నుంచి వచ్చారు వంటి వివరాలను సేకరించారు. అలాగే మండలంలోని పలుచోట్ల వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎవరైనా గొడవలకు దిగిన వివాదాస్పదంగా కనిపించిన వెంటనే తమకు సమాచారం అందివ్వాలన్నారు. ఎవ్వరైనా గొడవలకు దిగితే చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయన్నారు.

వీరభద్రస్వామికి బూరెలతో నైవేద్యం

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంకలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ వార్షికోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు స్వామివారికి బూరెలతో నైవేద్యం సమర్పించారు. పుత్సల వీరభద్రయ్య దంపతులు కర్తలుగా మాడా వాసు ఆధ్వర్యంలో వీరభద్ర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హనుమాన్ జయంతి సందర్భంగా తమలపాకుల పూజ, సింధూర పూజ నిర్వహించారు. శ్రీశైలం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, చంద్రకళ దంపతులు స్వామివారికి నూతన వస్త్రాలు సమర్పించారు.

అంకితభావంతో పని చేసేవారికే గుర్తింపు

అంబాజీపేట: విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసే వారికి ఎల్లవేళలా గుర్తింపు ఉంటుందని మార్కెట్ కమిటీల కార్యదర్శులు ఐ.రమేష్, వి.రామకృష్ణ, ఉద్యోగుల సంఘ నేత జాన్‌మోజెస్ అన్నారు. అంబాజీపేట మార్కెట్ యర్డులో యార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన నేలపూడి సుందరయ్య సన్మాన సభను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్యను పలువురు సత్కరించి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆయా మార్కెట్ కమిటీల యార్డు సహాయకులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలకు అనుమతులు తప్పనిసరి

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రైవేట్ పాఠశాలలు ఏర్పాటు చేస్తే తప్పనిసరిగా జిల్లా విద్యాశాఖ నుంచి ముందస్తు, అనుమతులు తీసుకోవాలని ఎంఈఓలు పి.సాలెంరాజు, పీవీ సుబ్బరాజు కోరారు. ఆలమూరు మండల విద్యాశాఖ కార్యాలయంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. అలాగే అనుమతులు పూర్తయిన పాఠశాలలు సత్వరమే తమ లైసెన్స్‌లను పొడిగించుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.